ఔషధాల వినియోగంపై నిఘా

హైదరాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త: ఇకపై నగరంలో మత్తు, కండల కోసం ఔషధాల వినియోగంపై నిఘా ఉంచాలని పోలీసులు నిర్ణయించారు. ఇప్పటివరకు కేవలం మాదకద్రవ్యాలపైనే దృష్టిపెట్టిన అధికారులు ఇకపై మత్తు ఆ దిశలో చర్యలు ఉపక్రమించనున్నారు. ఈ విషయంలో అధికారులు మెడికల్ షాపులపై కూడా దేగకన్ను వేస్తున్నారు. పక్క దారి పడుతున్న పలు ఔషదాలపైనే దృష్టిసారించాలని నిర్ణయించారు. డ్రగ్ కంట్రోల్ అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నగర వ్యాప్తంగా నిఘా ముమ్మరం చేసిన అధికారులు కోడిన్ ఫాస్ఫేట్ సిరప్, అల్ప్రాహారం, స్టామ్‌బేర్, ఏర్‌క్లైన్, డెబొలాన్ టాబ్లెట్లు, డ్యూరాడెక్స్, సీ-జెక్ట్ ఇంజెక్షన్లు విక్రయిస్తున్న ముఠాలు కూడా చిక్కాయి. ఈ నిఘా, దాడులు కొనసాగించాలని నిర్ణయించిన అధికారులు ఇలాంటి ఔషధాల వినియోగాన్ని అధ్యయనం చేస్తున్నారు. కాగా శస్త్రచికిత్స చేసే సందర్భంలో రోగులకు మత్తు కలిగించడం కోసం ఇచ్చే కీటమైన్ హైడ్రోక్లోరైడ్ మార్కెట్‌లో విచ్చలవిడిగా లభిస్తుండడంతో అనేక మంది మత్తుకు బానిసైన వారు ఈ ఇంజెక్షన్‌ను వినియోగించడం ప్రారంభించగా, వెంటనే స్పందించిన ప్రభుత్వం దీన్ని నియంత్రణ జాబితాలోని మందుగా మార్చింది. కీటమైన్ నుంచి పొడిని తయారు చేసి నిషా కోసం వాడుతుండడంతో 2011లో కేంద్రం ఈ పొడిని నిషేదిత మాదకద్రవ్యాల జాబితాలో చేర్చింది. ఇప్పుడు ఈ పొడిని ఇంట్లోనే తయారు చేసి విక్రయిస్తున్న, వినియోగిస్తున్న వారు పుట్టుకువచ్చారని అధికారులు కూడా గుర్తించారు. ప్రస్తుతం మత్తు పదార్థాలలో గంజాయికి ప్రత్యామ్నాయంగా నెట్రావిట్‌ను కూడా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం ఇదొక్కటే కాదు మాదకద్రవ్యాలు కాని ఇలాంటి మత్తు మందులు అనేకం నగరంలో చెలామణి అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి వారికి బ్లాక్‌మార్కెట్‌లో ఆ మత్తు 'మందుల్ని సరఫరా చేయడానికి అనేక వ్యవస్థీకృత ముఠాలు సైతం పుట్టుకువచ్చాయి. గంజాయికి బానిసైన యువత ప్రస్తుత నెట్రావిట్ టాబ్లెట్స్ వినియోగిస్తున్నారు. మత్తు కోసం వినియోగిస్తున్న ఔషధాల్లో దగ్గు మందులే అధికంగా ఉన్నాయి. కొన్ని రకాలైన ఔషదాలను సేకరించడం కష్టసాధ్యం. అలాగే వైట్నర్‌ను ఖరీదు చేయడం తేలికే అయినప్పటికీ వినియోగించేప్పుడు ఇతరుల దృష్టిలో పడే అవకాశాలుంటాయి. ఈ కారణాల నేపథ్యంలో దగ్గుమందు ఎక్కువగా వినియోగిస్తున్నారు. అత్యధిక శాతం దగ్గు మందుల్ని డెక్స్‌ట్రోమెథార్ఫిన్, కోడైన్‌లతో తయారు చేస్తారు. కోడైన్‌తో కూడిన ఈ రసాయనం నియంత్రిత జాబితాలో ఉన్న మాదవద్రవ్యం. మత్తును కలిగించే దీన్ని కేవలం ఔషధాత తయారికి మాత్రమే వినియోగిస్తుంటారు. ప్రధానంగా డెక్స్‌ట్రోమెథార్ఫిన్ కారణంగానే అనేక మంది దగ్గు మందులకు బానిసలు అవుతున్నారని పోలీసులు గుర్తించారు. కొన్ని ఔషధాలను కేవలం మత్తు కోసమే కాదు. కండల కోసమూ వినియోగించడం ఆందోళన కలిగించే అంశం.

అత్యవసర సమయాల్లో వినియోగించే మెఫ్‌టెర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్‌ను కొందరు యువత స్టెరాయిడ్‌గా వినియోగిస్తోంది. జిమ్‌లో ఎక్కువ సమయం గడిపి, కండలు పెంచడానికి ఈ సూది మందు తీసుకుంటోంది. ఈ ఇంజెక్షన్‌ను అక్రమంగా యువతకు విక్రయిస్తున్న ముఠాలను గతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.

డ్రగ్స్ బారిన పడుతున్న యువత

నగరంలో చాపకింద నీరులా డ్రగ్స్ వినియోగం విపరీతంగా పెరుగుతుండడంతో యువకులు మృత్యువుబారిన పడుతున్న సంఘటనలు పెరిగిపోతున్నాయి. డ్రగ్స్ మహమ్మారి వల్ల యువత వింత చేష్టలు, నలుగురిలో ఉన్నా ఒంటరిగానే ఉండడం, పార్టీ ఏదైనా మత్తులో తూగడం వంటి సంఘటనలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పార్టీలు, పబ్‌లు ఇలా ఎక్కడైనా ఏదో ఒక స్థాయిలో డ్రగ్ వినియోగం పెరగడంతో యువత తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇలా ఎక్కడైనా ఏదో ఒక స్థాయిలో డ్రగ్ వినియోగం జరుగుతోందని అంటున్నారు.

స్నేహితులతో కలిసి డ్రగ్స్ తీసుకుని వచ్చి ఇంట్లో ఒంటరి జీవితం గడుపుతున్నారు. డ్రగ్స్ వినియోగం పెరిగి వింతగా ప్రవర్తించిన సంఘటనలతో వారి తల్లిదండ్రులు భయపడి చికిత్స చేయించడం కోసం వైద్యుల వద్దకు పరుగులు తీసే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి కేసులు గతంలో కంటే 10 నుంచి 15శాతం పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు. స్టిమెలెన్స్, నాన్ స్టిమెలెన్స్ అని రెండు రకాల మాదవ ద్రవ్యాలు ఉంటాయని, ఇందులో నాన్ స్టిమిలెన్స్‌లో మత్తుగా ఉంటారని, కొకైన్, ఎల్ఎస్‌డి, ఎండిఎంఏ తదితర స్టిమిలెన్స్ డ్రగ్, హెరాయిన్, కొకైన్, డైజోపియన్, గంజాయ్ తదితర వాటిని నాన్ స్టిమెలెన్స్‌గా పరిగణిస్తామని వైద్యులు చెబుతున్నారు.

డ్రగ్ తీసుకోవడం వల్ల నిద్ర పట్టదని, కడుపులో నొప్పి, కాళ్ళు చేతులు వణకడం, విరేచనాలు, బిగ్గరగా ఏడవడం, నోట్లో నుంచి నీరు కారడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటారు. స్టిమెలెన్స్ డ్రగ్స్ వల్ల వేగంగా గుండె స్పందనలు పెరుగుతాయి. గుండె వైఫల్యం చెందడం,డీ హైడ్రేషన్, మూత్ర పిండాలు వైఫల్యం చెందడం, స్ట్రోక్ వంటి ఇబ్బందులువస్తాయి. డ్రగ్స్‌ను ఎక్కువ డోసు తీసుకునే వారికి గుండె జబ్బులు ఉంటే వారికి ఆకస్మాత్తుగా గుండెపోటు వస్తుంది. మితిమీరిన డోసు వల్ల మెదడు నిస్తేజంగా మారడం, ఊపిరితిత్తులకు ఆక్సిజన్ అందకపోవడం, చనిపోవడం వంటి ముప్పు ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వచ్చే వారం డబుల్ ఇళ్ల పంపిణికి ఏర్పాట్లు

- నగరంలో పూర్తయిన ఇళ్లు 70వేలు
- ఇప్పటి వరకు పంపిణి చేసినవి 4100
- పంపిణికి సిద్ధంగా ఉన్నవి 65900
- జిహెచ్ఎంసికి అందిన దరఖాస్తులు 7,09,718
- లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియలో వేగం పెంచాలని అధికారులకు ఆదేశాలు

2016లో జిహెచ్ఎంసిలో జరిగిన పాలక మండలి ఎన్నికల సమయంలో సిఎం కెసిఆర్ గ్రేటర్ పరిధిలోని పేదలకు ఒక లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి, ఉచితంగా పంపిణి చేస్తామని ప్రకటించారు. అనంతరం పనులు మొదలవగా.. ప్రస్తుతం 67,500 ఇళ్లు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. డబుల్ బెడ్‌రూమ్‌ల కోసం ఇప్పటికే 7,09,718 దరఖాస్తులు జిహెచ్ఎంసికి చేరాయి. ఈ దరఖాస్తులను కొంత మేర క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన కూడా చేశారు. ఇప్పటికే పూర్తయిన ఇళ్లను తక్షణం లబ్ధిదారులకు పంపిణి చేయమని రాష్ట్ర పురపాలక మంత్రి కెటిఆర్ ఆదేశించారు.

హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను వచ్చే వారం నుంచి లబ్ధిదారులకు అందించనున్నారు.ఈ ఏడాది నవంబర్‌లో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో మహానగరం పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణికి ముహూర్తం ఖరారైంది.ప్రస్తుతం 67,500 ఇళ్లు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ బుధవారం జారీ చేసిన ఆదేశాలతో వీటికి కదలిక వచ్చింది.ఈ మేరకు మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్‌లతో మంత్రి కెటిఆర్ సమావేశమయ్యారు. జిహెచ్ఎంసి అధికారులు కూడా హాజరైన ఈ భేటీలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణిపై చర్చ జరిగిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియ కూడా దాదాపు పూర్తికావ చ్చిందని తెలిపారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

జిహెచ్ఎంసిలో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి, పేదలకు పంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కెటిఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 70వేల ఇళ్లతో పాటు చివరి దశలో ఉన్న మరో ఐదువేల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి వచ్చేవారం నుంచి లబ్ధిదారులకు అందజేస్తామని వివరించారు. గ్రేటర్‌లో ఇప్పటికే 4,500లకు పైగా ఇళ్లను లబ్ధిదారులకు అందించినట్లు మంత్రి తెలిపారు. లబ్ధిదారుల గుర్తింపు, ఎంపికలో రాజకీయ నేతల జోక్యం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు కెటిఆర్ వివరించారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం పరిశీలించి, అర్హులను గుర్తించిందని చెప్పారు. అదే విధంగా గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపికపైనా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. కాగా, మొత్తం జిహెచ్ఎంసి పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 70వేల ఇళ్లు పూర్తికాగా, 30వేల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి.ఈ 30వేల ఇళ్లలో 90 శాతం పనులు జరిగిన వాటిలో మిగిలిన పనులను పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ఉన్నారు. వీటిని పూర్తి చేయాలంటే ఇంకా రూ.2,800 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఇప్పటికే 400 కోట్ల వరకు నిధుల బకాయిలు ఉండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ఈ పనులన్నీ 2016-17 ఎస్ఎస్ఆర్ ప్రకారం చేపట్టారు. ఇప్పుడు ఇసుక, సిమెంట్, స్టీలు రేట్లు విపరీతంగా పెరగడంతో ఈ పెరిగిన ధరలను తమకు వర్తింప చేస్తేనే పనులు మొదలుపెడతామని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. ఈ రేట్లను వర్తింపు చేయాలంటే మరో 600 కోట్లను వారికి అదనంగా చెల్లించాల్సి వస్తుందని ఒక సీనియర్ ఇంజనీర్ తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇటివల పలు కార్యక్రమాలు వేగంగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వం..ఇండ్ల పంపిణి కార్యక్రమాన్ని కూడా అదే కోవలో పూర్తి చేయాలని చూస్తున్నట్లు కనిపిస్తోందనే టాక్ వినిపిస్తోంది.

అత్తింటి వేధింపులకు నవ వధువు బలవన్మరణం

లావణ్య (పాతచిత్రం)

యూసుఫ్‌గూడ, ఆగస్టు 16, ప్రభాతవార్త : అత్తింటి వేధింపులు తాళలేక వివాహం అయిన 5నెలలకే తనువు చాలించిన నవనధువు లావణ్య(25) బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌పిఆర్ హిల్స్ ఆశయ్య నగర్‌లో నివాసముండే లావణ్య(25) రాజేందర్ అనే యువకుడితో 5నెలల క్రితం వివాహం జరిగింది. అప్పటినుండి లావణ్య అత్తవారింట్లో నివాసం ఉంటుంది. భర్త రాజేందర్ జిహెచ్ ఎంసిలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. లావణ్యకు కొంచెం చెవుడు ఉండటంతో ఎవరైనా మాట్లాడితే వినిపించక పోవడంతో ఈలోపం వలన చుట్టు ప్రక్కల వాళ్ళతో, అత్తింటి వాళ్ళతో వేధింపులకు గురయింది. అదేవిధంగా అత్తింటివాళ్ళ అదనపు కట్నం వేధింపులు కూడా ఉన్నాయని అందువలన తన కూతురు అత్తారింట్లో ఎవరు లేని సమయంలో స్టీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని లావణ్య తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లావణ్య మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించి వారి తల్లిదండ్రులకు అందజేశారు.లావణ్య భర్త రాజేందర్ పైనా, అత్త నర్సవ్వ పైనా ప్రధానంగా వరకట్నం హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బోరబండ పోలీస్ ఇన్స్‌పెక్టర్ కామల్ల రవికుమార్ తెలిపారు.

మంత్రి తలసానిని కలిసిన భాగ్యనగర్ కావడి సేవా సంఘం

చార్మినార్, ఆగస్టు 16 ప్రభాతవార్త : శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 20వ తేదీ ఆదివారం నిర్వహించనున్న భవ్య కావడి యాత్రలో పాల్గొనాలని కోరుతూ బుధవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి భాగ్యనగర్ కావడి సేవా సంఘం ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పురుషోత్తం అగర్వాల్,రుబీ మిశ్ర,ఫంకజ్ వర్మ,మీను గుప్తా,రితేష్ మోదీ,జగదీష్ ప్రసాద్ వర్మలు పాల్గొన్నారు.

షటిల్ ఆడుతూ గుండెపోటులో మృతి

మృతుడు కృష్ణారెడ్డి (ఫైల్‌ఫోటో)

ఉప్పల్, ఆగస్టు 16 ప్రభాతవార్త : కరీంనగర్ జిల్లాలో డాన్స్ ఆడుతూ గుండెపోటుతో ఒక విద్యార్థిని మృతి చెందిన సంఘటన మరువక ముందే రామంతాపూర్‌లో షటిల్ ఆడుతూ గుండెపోటుతో ఒక వ్యక్తి మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ ఆర్టీసి కాలనీలో నివసించే కీసర కృష్ణారెడ్డి (48) అనే వ్యక్తి ఒక ప్రచురణ సంస్థలో పనిచేస్తున్నాడు. అయితే రామంతాపూర్ ఎండోమెంట్ కాలనీలో ప్రతి రోజు షటిల్ ఆడేందుకు వెళుతుంటాడు. అయితే బుధవారం ఉదయం 7 గంటల సమయంలో షటిల్ ఆడిన తర్వాత తన కుమారుడిని స్కూల్‌లో దింపేందుకు తన ద్విచక్ర వాహనం వద్దకు వచ్చి కింద పడిపోయాడు.దీంతో తోటి స్నేహితులు గమనించి అతనికి ప్రాథమిక చికిత్స ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. షటిల్ ఆడుతుండగా కృష్ణారెడ్డి గుండెపోటు వచ్చి ఉంటుందని, గమనించకపోవడం వల్ల మృతి చెంది ఉంటారని వైద్యులు తెలిపారు.ఉదయం షటిల్ ఆడేందుకు వెళ్లిన వ్యక్తి ఇలా మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరు, మున్నీరు అవుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని ఎపిలోని అతని స్వస్థలానికి తరలించారు. ఇదిలా ఉండగా ఆకస్మిక గుండెపోటు మరణాలు ప్రతి ఒక్కరిని కలిచివేస్తున్నాయి. చిన్న వయస్సు నుంచి పెద్దల వరకు అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృత్యువాత పడుతున్నారు. మారిన ఆహారపు అలవాట్లు, సమయపాలన లోపం, పనిఒత్తిడి, మానసిక ఆందోళనలు గుండెపోటుకు కారణమని వైద్యులు పేర్కొంటున్నారు. శారీరక శ్రమ లేకపోవడం, రోజు వారి జీవితంలో ఒత్తిడి, వ్యక్తిగత సమస్యల మరణాలకు కారణమవుతున్నాయని, ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులు పేర్కొంటున్నారు.

మూర్ఛవ్యాధితో యువకుడి ఆత్మహత్య

ఆత్మహత్య చేసుకున్న నిటయ్

జీడిమెట్ల, ఆగస్టు 16 ప్రభాతవార్త : మూర్ఛవ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన బబ్లూ మండల్ జీవనోపాధి కోసం పదేళ్ళ క్రితం నగరానికి వలస వచ్చి సూరారంలోని రాజీవ్‌గృహకల్పలో ఉంటున్నాడు. ఇతని సోదరుడు నిటయ్‌మండల్ ఉపాధి కోసం వచ్చి హెల్పర్‌గా పనిచేస్తూ వీరితోనే కలిసి ఉంటున్నాడు. కొంతకాలంగా నిటయ్ మూర్ఛవ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో బబ్లూ దంపతులు జూన్ పార్కును చూసేందుకు వెళ్ళారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న నిటయ్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు బబ్లూ సమాచారం అందించడంతో ఇంటికి చేరుకొనే చూడగా సోదరుడు మృతిచెంది ఉన్నాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్లు

ఎన్నికల ప్రక్రియపై బిఎల్‌వోలకు శిక్షణ

దుండిగల్, ఆగస్టు 16 ప్రభాతవార్త: దుండిగల్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో బుధవారం బూత్‌లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లకు ఎన్నికల ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దుండిగల్, కొంపల్లి కమీషనర్లు సత్యనారాయణరావు, శ్రీహరిలు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఫారం-6, ఫారం-6ఎ, ఫారం-6బి, ఫారం-7, ఫారం-8లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రిటర్నింగ్ ఆఫీసర్ ఆదేశానుసారం ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలన్నారు. ప్రక్రియను వీలైనంత వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ నర్సింహులు, శ్రీనివాస్, బిఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నిమ్స్ వైద్యుడికి టోకరా

హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త: నిమ్స్ వైద్యుడికి సైబర్ నేరగాళ్లు టోకరా ఇచ్చారు. పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో సీనియర్ రెసిడెంట్ గా పని చేస్తున్న వైద్యుడికి సైబర్ నేరగాళ్లు దమ్కీ ఇచ్చారు. అసలేం జరిగిందంటే.. ఓఎల్ఎక్స్‌లో నిమ్స్ వైద్యులు అమ్మకానికి ఓ ఎలక్ట్రిక్ కుర్చీ పెట్టారు. జితేంద్రశర్మ పేరుతో వైద్యుడికి సైబర్ నేరగాడు ఫోన్ చేశాడు. తనకు కూకట్‌పల్లిలో ఫర్నిచర్ దుకాణం ఉందని తనని తాను పరిచయం చేసుకున్నాడు. కుర్చీ కొనుగోలు చేస్తానని చెప్పి డబ్బు పంపేందుకు క్యూఆర్ కోడ్ పంపించాడు. దానిని స్కాన్ చేయాలని చెప్పడంతో నమ్మిన వైద్యుడు వెంటనే స్కాన్ చేశారు. అంతే.. ఆయన ఖాతా నుంచి రూ.2.58లక్షలు కట్లు మూసి తెరిచేసరికి మాయమయ్యాయి.

గద్దర్ మరణం కళా లోకానికి తీరని లోటు

టిజెఎస్ అధ్యక్షుడు కోదండరామ్

గద్దర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కోదండరామ్

అల్వాల్, ఆగస్టు 16 ప్రభాతవార్త: ప్రజా గాయకుడు గద్దర్ మరణం కళా లోకానికి తీరని లోటని టిజెఎస్ అధ్యక్షుడు ఆచార్య కోదండరామ్ పేర్కొన్నారు. బుధవారం అల్వాల్‌లోని గద్దర్ నివాసానికి వచ్చిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకు ముందు మహాబోధి పాఠశాలలోని సమాధిని సందర్శించి నివాళులర్పించారు. విమలా గద్దర్, కూతురు వెన్నెల, కుమారుడు సూర్యకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఉద్యమాలు ద్వారా పేద బలహీన వర్గాల హక్కులు కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి గద్దర్ అని తెలిపారు. పాటకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన వ్యక్తి లేక పోవడం ప్రజానికానికి తీరనిలోటని చెప్పారు. తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో తన ఆట పాటతో ప్రజలను చైతన్య పరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి దయాకర్, రెడ్డిపల్లి శ్రీనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆరేళ్ల బాలుడు మృతి

కిరాణ షాపుకు వెళ్లి శవమై తిరిగి వచ్చాడు

బావిలో నుంచి బాలుడి మృతదేహంను వెలికి తీస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యుడు (ఆరేళ్ల బాలుడు బన్నీ మృతదేహం)

నార్సింగి, ఆగస్టు 16 ప్రభాతవార్త : అనుమానాస్పద స్థితిలో ఆరేళ్ల బాలుడు బావిలో శవమై కనిపించాడు. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంకు చెందిన బాల్‌రాజ్ తన భార్య, బిడ్డలతో కలిసి వలస వచ్చి హైదరాబాద్ నగర శివారులోని గండిపేట మండలం నార్సింగి ప్రాంతంలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడి కుమారుడు బన్నీ(6) మగళవారం రూ.10.తీసుకొని కిరాణా షాపుకని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో నార్సింగి పోలీసులలకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం నార్సింగిలోని ఓ పురాతన బావిలో బాలుడు పడి ఉన్నాడని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని రంగంలోకి దించింది. అతి కష్టమ్మీద బాలుడి మృతదేహంను బావిలో నుంచి బయటకు తీశారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించామని, పోస్టుమార్టం నివేదిక వచ్చాక బాలుడిది ఎలాంటి మరణం అన్నది వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాడు అక్రమం.. నేడు సక్రమం

కూల్చివేసిన చోటే మళ్లీ నిర్మాణం

చింతలకుంట ఎఫ్‌టీఎల్‌లో బహుళ అంతస్థుల నిర్మాణాలు

అక్రమ నిర్మాణమని కూల్చివేస్తున్న దృశ్యం(ఫైల్)

కూల్చిన చోటే మళ్లీ కొనసాగుతున్న నిర్మాణం

దుండిగల్, ఆగస్టు 16 ప్రభాతవార్త : అధికారుల మధ్య సమన్వయ లోపమా.. సహకారమో తెలియదుగాని అక్రమ నిర్మాణం అంటూ కూల్చివేతలు చేపట్టిన భవనాలు తిరిగి నిర్మితమవుతున్నాయి. సంపూర్ణంగా ఎఫ్‌టిఎల్‌లో బహుళ అంతస్థుల నిర్మాణాలను కొనసాగిస్తూ నిర్మాణదారులు అధికారులకు సవాల్ విసురుతున్నారు. నిర్మాణదారుల మాయకు నాడు అక్రమం అని పేర్కొన్న అధికారులు నేడు మిన్నుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. గండిమైసమ్మ-దుండిగల్ మండలం, దొమ్మర పోచంపల్లి పరిధిలోని చింతలకుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలు పదుల సంఖ్యలో వెలిశాయి. ఈవిషయమైన ఫిర్యాదులు అందుకున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువును సందర్శించారు. ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్లలో అప్పటికే పలు నిర్మాణాలు పూర్తి చేసుకోని ఉండడంతో పాటు మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నట్లు గుర్తించారు. ఇరిగేషన్ ఆదేశానుసారం రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది నిర్మాణ పనులు నిలిపివేశారు. ప్రారంభదశలో ఉన్న నిర్మాణాలను జెసిబి సహాయంతో నేలమట్టం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్న 15రోజుల తరువాత పరిస్థితి మారిపోయింది. కూల్చివేసిన నిర్మాణాలను ప్రారంభించి చకచకా కొనసాగిస్తున్నారు. ఇదే విషయమై ఇరిగేషన్, రెవిన్యూ ఫిర్యాదులు వెళ్తే ఈసారి చడిచప్పుడు లేదుకదా కనీసం అటువైపు కన్నెత్తి చూసి పాపనపోలేదు. నిర్మాణదారుల మాయ ఎంతలా పనిచేస్తుందంటే అనతి కాలంలోనే బహుళ అంతస్థులు నిర్మించేలా. ఇలాగే నిర్మాణాలు కొనసాగితే చెరువు మనుగడ పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువులో ఆక్రమణలు తొలగించి చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

రోగులకు మందులు ఇవ్వాలి : కలెక్టర్ అనుదీప్

ఆస్పత్రి రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, వైద్యాధికారులు

నాంపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన రోగులను శ్రద్ధగా పరీక్షించి వారికి కావాల్సిన మందులన్నింటినీ ఇవ్వాలని హైదరబాద్ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ బుధవారం ఆదేశించారు. బాగ్‌లింగంపల్లిలో తిలక్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వివరాలను మెడికల్ ఆఫీసర్‌ని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రిజిస్టర్లను, రోగుల వివరాలను సునిశితంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను కలియతిరిగి పరిస్థితులను తెలుసుకున్నారు. అక్కడ ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డ.ఆ వెంకటేష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రీకళ, మెడికల్ అధికారి దీప్తిపటేల్ పాల్గొన్నారు.

అంబర్‌పేట శ్రీరమణ థియేటర్-ఆలీకేఫ్ చౌరస్తా వరకు 3కోట్లతో సెంట్రల్ మెరిడియన్ వర్క్స్

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ

విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న కౌన్సిలర్ శంకర్‌నాయక్

దుండిగల్, ఆగస్టు 16 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి తాండా-2లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రాన్యూయెల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి కౌన్సిలర్ శంకర్‌నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూతనందిస్తున్న గ్రాన్యూయెల్స్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. కంపెనీ సిహెచ్ఆర్‌వో ఉమారావు మాట్లాడుతూ నిరుపేదలు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలలకు తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్పొరేట్ అఫైర్స్ పట్నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం డైనింగ్‌తో కూడిన కిచెన్, నూతన పాఠశాల భవనము నిర్మించేందుకు చారిటీ నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్ అడ్మిన్ ప్రభాకర్‌రెడ్డి, సిఎస్ఆర్ లోకేష్, నాయకులు రవీందర్‌నాయక్, ప్రేమ్ సింగ్, అమర్‌సింగ్, హనుమంతునాయకు, స్వామినాయక్, శాంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు నెలవు కళలు

రవీంద్రభారతి, ఆగస్టు 16 ప్రభాతవార్త : ప్రపంచంలో అత్యంత ప్రాముఖ్యతను చాటుకున్న భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు, నిదర్శనం కళలేనని వక్తలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాకారులు వైవిధ్యభరితమైన అంశాలతో కళాప్రదర్శనలిచ్చి ప్రేక్షకులను పరవశులను చేశారు. చిరుజల్లుల రాత్రివేళ జాతీయస్ఫూర్తిని ఇనుమడింపజేస్తూ కవుల కలాలనుండి జాలువారిని కవితలు, సుమధురగాత్రంతో కవితాగానం, అద్భుత అంశాలతో సంప్రదాయ, జానపద, శాస్త్రీయ నృత్యాలు, ప్రముఖ గాయకుడు వి.రామకృష్ణశర్మ. మతసామరస్యం, దేశభక్తి, స్వాతంత్ర సమరమాన్ని కళ్లకుకడుతూ దేశం కోసం పోరాడిన యోధులను గుర్తుచేస్తే ప్రజల్లో ఏకతాభావాన్ని ప్రోదిగొల్పుతూ ఆలపించిన పాటల తోపాటు పలువురు వర్ధమాన గాయకులు వి.మంజుల, జయ, లక్ష్మీ సతీష్‌కుమార్, అనన్య భరద్వాజ్, శ్రావ్య తదితరుల బహుభాషా స్వరమాధురి, చిన్నారి కళాకారుల నృత్య పాదవిన్యాసాలు కళాభిమానులను సమ్మోహితుల్నిచేసి మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ నాయకుడు పిడమర్తి గణేశ్ తదితరులు కళాకారులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

మనబస్తీ మనబడి పనులు పూర్తి చేయాలి : కలెక్టర్ అనుదీప్

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, విద్యాసంస్థ అధికారులు

నాంపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త : నగరంలో మన బస్తి మన బడి కార్యక్రమంలో మంజూరైన పనులన్నింటినీ సత్వరమే పూర్తిచేయాలని హైదరబాద్ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ఇంజనీరింగ్ అధికారులను బుధవారం ఆదేశించారు. కాచిగూడలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన మనబస్తి మనబడి కార్యక్రమ జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలిచ్చారు. ఆ ప్రాంగణంలోని జూనియర్ కాలేజీ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో ముచ్చటిస్తూ ముఖ్యమైన ఈ సంవత్సరం కష్టపడి చదివి మంచిమార్కులు తెచ్చుకుంటే మంచి కాలేజీలో సీటుపొంది జీవితంలో స్థిరపడవచ్చని తెలిపారు. పాఠశాలలోని వసతులు, సమస్యలను ప్రదానోపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రోహిణి, ప్రిన్సిపాల్ స్వర్ణలత, ప్రదానోపాధ్యాయురాలు సుకన్య, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ముస్లీం మైనార్టీల కోసం కబ్రస్తాన్ ఏర్పాటుకు కృషి

కార్పోరేటర్ శాంతి సాయిజన్‌శేఖర్

వక్స్‌బోర్డు చైర్మన్ మసిదుల్లా ఖాన్‌తో మాట్లాడుతున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

నాచారం, ఆగస్టు 16 ప్రభాతవార్త: నాచారం డివిజన్‌లో ముస్లీం మైనార్టీల కోసం కబ్రస్తాన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని కార్పోరేటర్ శాంతి సాయిజన్‌శేఖర్ పేర్కొన్నారు. కబ్రస్థాన్ ఏర్పాటు కోసం పలు మార్లు వినతులు వచ్చిన నేపథ్యంలో బుధవారం నాంపల్లిలోని హజ్ హౌజ్‌లో వక్స్ బోర్డు చైర్మన్ మసీదుల్లా ఖాన్‌ను కార్పోరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ కలిసి వినతిపత్రాన్ని అందజేసి కబ్రస్థాన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందుకు చైర్మన్ మసీయుల్లా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. మల్లాపూర్ డివిజన్‌లోని చాంద్ పాషా దర్గాలో ప్రభుత్వ భూమి ఉన్నదని సదరు స్థలాన్ని సర్వే చేయించి నాచారం, మల్లాపూర్ డివిజన్ ప్రజలకు కబ్రస్థాన్ ఏర్పాటుకు కృషి చేయాలని వారిని కోరినట్లు కార్పోరేటర్ పేర్కొన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి తహసిల్దార్‌కు సర్వే చేయించమని చెబుతామని చైర్మన్ హామినిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిజన్ శేఖర్, మైనార్టీ నాయకులు బద్రుద్దీన్, జాకీర్ హుస్సేన్, రఫిక్, ఎండి గౌసుద్దీన్, అజ్మీరా షాయిన్, జహీర్ హఫీజ్, కట్టబుచ్చన్న గౌడ్, అంజి, శివకుమార్ తధితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌తో వాగ్వాదానికి దిగిన ఇద్దరికి 20రోజుల జైలు

తార్నాక, అగస్టు 16 ప్రభాతవార్త: విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో వాగ్వాదం చేసి విధులను అడ్డుకున్న ఇద్దరి వ్యక్తులకు 20 రోజులు కోర్టు జైలు శిక్షను విధించింది. నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తార్నాక చౌరస్తాలో ఈ నెల 10న ట్రాఫిక్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మాణికేశ్వరీనగర్‌కు చెందిన శ్రీశైలం, చిలుకలగూడకు చెందిన ప్రశాంత్ లు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కల్గించారు. దీంతో కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఒ.యూ పోలీసులు కేసు నమోదు చేసి ఆధారాలను కోర్టు ముందు ఉంచారు. దీంతో నాంపల్లిలోని 8వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ లక్ష్మణ్ రావు విధులకు ఆటంకం కల్గించిన ఇద్దరికి 20 రోజులు జైలు శిక్షను విధించారు.

కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఉద్యోగ భద్రత కల్పించాలి

కొంపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త : ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కొంపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బంది బుధవారం చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కమీషనర్ శ్రీహరిలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మున్సిపల్ ఆవిర్భం నుండి అరకొర జీతాలతో పనిచేస్తున్నామని జీతాలు పెంపుదల చేయడంతో పాటు రెగ్యూలరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. స్పందించిన చైర్మన్, కమీషనర్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిగేలా చూస్తామని హామినిచ్చారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

బండారి లేఅవుట్‌లో పనులను ప్రారంభిస్తున్న కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు

నిజాంపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్ఎన్‌డిపి పనులు జరుగుతున్న క్రమంలో బండారి లేఅవుట్‌కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. వర్షాలు కురుస్తున్న సమయంలో సమస్యత మరింత తీవ్రంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయాన్ని కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన వారు బుధవారం రోడ్ల మరమ్మత్తు పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ తాతినేని లక్ష్మీకాంతారావు, ట్రెజరర్ మల్లు వెంకట నర్సింహా రెడ్డి, వార్డు అధ్యక్షులు పువ్వాడ విజయరవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల నిరాహార దీక్షకు ప్రజా ఏక్తా పార్టీ మద్దతు

గోషామహల్,ఆగస్టు16ప్రభా తవార్త: భవన నిర్మాణ కార్మికు లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని సిఐటియూ ఆధ్వర్యంలో గౌలిగూడ చమన్, బేగం బజార్ లేబర్ అడ్డా వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త కార్మికుల కు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించి మద్దతు తెలిపారు. శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ కార్మికుల కు కేంద్ర,రాష్ట్రా ప్రభుత్వాలు వెంటనే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని,పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి శ్రావణ్‌కుమార్, గోషామహల్ జోనల్ నాయకులు కె.జంగయ్య,పి. నాగేశ్వర్, టి.అంజయ్య, పి.భాగ్యమ్మ, అంజయ్య, లాలు నాయక్,కె.నర్సిహులు,కె.రాజు, బాల్‌రాజ్, రమేష్ పాల్గొన్నారు.

ఎఫ్‌టిఎల్ స్థలంలో ఆక్రమణల తొలగింపు

కొంపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త: కొంపల్లి, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల పరిధిలో ఉన్న సుమాల్ చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్లలో కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు చోటు చేసుకుంటున్నట్లు కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ జిల్లా కలెక్టర్, మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఇరిగేషన్, రెవిన్యూ యంత్రాంగం సదరు చెరువును సందర్శించి ఆక్రమణలు చోటు చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు బుధవారం పోలీసు బందోబస్తు మధ్య ఇరిగేషన్ డీఈ సురేష్ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమాల్ చెరువు సుమారు 45ఎకరాల విస్తీర్ణంలో ఉందని చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్లను ఆక్రమిస్తే నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఇ నికేష్‌కుమార్, ఆర్ఐ చంద్రకాంత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఇర్షాద్, పోలీసులు, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాలలో అరుదైన శస్త్రచికిత్స

నిజాంపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త: బాచుపల్లిలోని మమత అకాడమీ మెడికల్ సైన్స్ వైద్యశాలలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి ఓ కార్మికుడి ప్రాణాలు కాపాడారు. బాచుపల్లి సమీపంలో భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు మూడవ అంతస్థు నుండి కిందపడిపోయాడు. ఈప్రమాదంలో అతని చాతి ఎముకలు విరిగి ఊపిరితిత్తులలోకి ఒక కర్ర, ఇనుపచువ్వ గుచ్చుకుపోయాయి. దీంతో సహా కార్మికులు అతన్ని సమీపంలో ఉన్న మమత వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించి అరుదైన శస్త్రచికిత్స చేయడంతో కార్మికుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈశస్త్ర చికిత్సకు సుమారు రూ,6లక్షలు అయ్యేదని, మమత వైద్యుల బృందం రూ,1లక్ష రూపాయాలలో పూర్తి చేశారని మేనేజింగ్ డైరెక్టర్ పువ్వాడ నయన్‌రాజ్ తెలిపారు. శస్త్ర చికిత్స పాల్గొన్న కార్డియాలజీ లంగ్స్ స్పెషలిస్ట్ డా.విజయ్, అనస్థీషియ, మెడికల్ డైరెక్టర్ డా.చంద్రశేఖర్, డీప్యూటి సూపరిండెంట్ డా.ప్రణీత్‌లకు అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా బాధితుని కుటుంసభ్యులు వైద్యశాల నిర్వాహకులకు వైద్యుల బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవారిని వేడుకుంటే కోరుకున్నకోర్కెలు నెరవేరుతాయి : జంపనప్రతాప్

1వ వార్డు బాపూజీ నగర్ నల్లపోచమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్, బిజెపి నేత రఘుచరణ్

కంటోన్మెంట్,ఆగస్టు 16 ప్రభాతవార్త: అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని 1వ వార్డు బాపూజీ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బిజెపి ఓబిసి రాష్ట్ర ఎగ్జిక్యిటీవ్ చైర్మన్ రఘుచరణ్,కవిత, ప్రముఖ వ్యాపారవేత్త ఓం చరణ్, సుమలతల ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రేమ్‌కుమార్, రామారావు, అజిత్, దుర్గయ్య, నరిస్సింహ్మ, జహింగీర్, మారుతీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పది : శ్రీగణేష్

1వ వార్డు చిన్నతోకట్టలో అన్నదానం చేస్తున్న బిఆర్ఎస్ నేత శ్రీగణేష్, బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ తదితరులు

అడ్డగుట్ట, ఆగస్టు 16 ప్రభాతవార్త: అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పదని కంటోన్మెంట్ బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని 6వ వార్డు చిన్నతోకట్ట మైసమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ ఆకలి మంటలతో అలమటిస్తున్న పేద ప్రజల ఆకలి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను ఆలయ కమిటీ ఎసభ్యులు సభ్యులు జాజుల క్రాంతీ, సాయిలు శాలువకప్పి ఘనంగా ఎసత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ పాండు యాదవ్, నరిస్సింగ్ రావ్, కాంగ్రెస్ నేత రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ అల్వాల్‌లో అమావాస్య అన్నదానం

అన్నదానంలో ఎమ్మెల్సీ బుగ్గారపు జనార్ధన్

అల్వాల్, ఆగస్టు 16 ప్రభాతవార్త: ఓల్డ్‌అల్వాల్ అంబేడ్కర్ నగర్ బస్ స్టాండ్ వద్ద బుధవారం అమావాస్య సందర్భంగా అన్నదానం జరిగింది. ప్రతి అమావాస్య రోజును ఆర్యవైశ్య సంఘం అన్నదానం చేయడం జరుగుతోంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ బుగ్గారపు జనార్ధన్ మాట్లాడుతూ అమా వాస్య రోజున ఆకలిగా ఉన్న వారి కడుపు నింపడం పుణ్యమని తెలిపారు. అల్వాల్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఉన్నతమైన కార్యక్రమంలో పాలు పంచుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్ గుప్త, రాగి రమేష్, సత్యనారాయణ, రామ్‌చందర్, నాగేంద్రరావు పాల్గొన్నారు.

నేటి నుంచి సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్‌లో రుక్మిణీ బాయి స్పోర్ట్స్

కంటోన్మెంట్, ఆగస్టు 16 ప్రభాతవార్త: వెస్ట్ మారేడ్‌పల్లిలోని సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో గురువారం (నేటి నుంచి) ఈ నెల 19వ తేదీ వరకు 11 రుక్మిణీ బాయి స్మారక స్పోర్ట్స్ అకాడమీ పోటీలు నిర్వహిస్తున్నామని స్కూల్ కరస్పాండెంట్ కె.జ్యోతి మధుసూదన్ రావ్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నగరంలోని అంతర్ పాఠశాలల పోటీలలో టేబుల్ టెన్నిస్,చెస్, క్యారమ్స్,వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో 70 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు. విజేతలకు లక్షకు పైగా నగదు బహుమతులు, ట్రోఫీ,ప్రశంసపత్రాలు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

గోవులను రక్షించాలి

గోవులకు గడ్డి వేస్తున్న భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త

అప్జల్‌గంజ్, ఆగస్టు 16 ప్రభాతవార్త: కుల,మతాలకు అతీతకంగా గోవులను రక్షించాల్సిన అవసరం,భాద్యత ప్రతి ఒకరిపై ఉందని తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు గుప్త అన్నారు.అధిక మాస శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని బుధవారం మహాత్మగాంధీ బస్‌స్టేషన్‌లో ఉన్న గోశాలలో గోవులకు పూజలు చేసి గడ్డివేశారు. ఈకార్యక్రమంలో రంజనీశ్రీరామోజ్,సూర్యశుక్లా, శ్రీనివాస్ గుప్త,మనోజ్,వినిత్‌యాదవ్, వినయ్ తివారి,సునీల్ అగర్వాల్,రాజారాం,అరున్‌సింగ్,ప్రేమ్‌శుక్లా,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం : విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి,రాష్ట్ర ప్రణాళిక సంఘం చైర్మన్ బోయినపల్లి వినోద్,ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి,ఆగష్టు 16 ప్రభాతవార్త : విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తున్నదని రాష్ట్ర విదా ్యశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శివరాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో మన బడి,మన బస్తీ,మన ఊరు కార్యక్రమంలో భాగంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి బుధవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం చైర్మన్ బోయినపల్లి వినోద్,రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్‌తో కలిసి రెండు కోట్ల యాభై ఏడు లక్షల రూపాయలతో నిర్మించనున్న పాఠశాల అదనపు తరగతి గదుల పనులకు శంకు స్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ ఒక యజ్ఞంలాగా మన ఊరు,మన బడి,మన బస్తీ మన బడికి శ్రీ కారం చుట్టారని తెలిపారు.తెలంగాణ విద్యార్థులు ఎక్కడకు వెళ్లిన పోటీలలో రాణించాలన్నదే ముఖ్యమంత్రి కేసిఆర్ అభిమతమని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి అరుణ,డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దేవసేన,జడ్పీ చైర్ పర్సన్ అనితా రెడ్డి,టిఎస్ డబ్ల్యుఐడిసి చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి,ఎంఇఓ రాంరెడ్డి,కార్పొరేటర్ అర్చన జయ ప్రకాష్,డివిజన్ అధ్యక్షులు ధర్మారెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుభాష్ రెడ్డి,ధర్మపాల్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

కోట్ల సహకారం వల్లనే చిత్రపురి కాలనీ వెలిసింది : శ్యాంప్రసాద్‌రెడ్డి

చిత్రపురి కాలనీలో కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి విగ్రహం ఆవిష్కరణ

మణికొండ చిత్రపురి కాలనీలో మాజీ సీఎం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

నార్సింగి, ఆగస్టు 16 ప్రభాతవార్త : సమైక్యాంధ్ర మాజీ సీఎం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి చొరవ వల్లనే సినీ కార్మికులుంటున్న చిత్రపురి కాలనీకి అంకురార్పణ జరిగిందని ప్రముఖ నిర్మాపత, శ్దాలయ అధినేత శ్యాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కోట్ల జయంతి వేడుకలను పురస్కరించుకొని చిత్రపురి కాలనీ అధ్యక్షులు వల్లభనేని అనిల్ నాయకత్వంలో విజయ భాస్కర్‌రెడ్డి విగ్రహాన్ని సినీ ప్రముఖులైన దిల్‌రాజు, సి.కళ్యాణ్, దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం తెలుగు సినిమాలన్నీ చెన్నై పట్టణం, దాని పరిసరాలలో షూటింగ్ జరిపే వారని, ఆ సమయంలో తెలుగు సినిమా వాళ్లకు కొన్ని ప్రాంతీయ విభేదాలు ఎదురయ్యేవని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి వివక్షలు పోవాలంటే హైదరాబాద్, దాని పరిసరాల్లోనే షూటింగ్‌లు జరిగేలా సహకరించాలని, కార్మికులు ఉండేందుకు నివాసయోగ్యమైన స్థలాన్ని ఇవ్వాలని అప్పటి సీఎం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డిని సీనీ పెద్దలు కోరారని తెలిపారు. ఇందుకు కోట్ల సమ్మతించి మణికొండలో 67.ఎకరాల భూమిని ఇచ్చేందుకు సమ్మతించారని, ఇప్పుడిక్కడ 4.వేల మంది సినీ కార్మికులు నివాసముంటున్నారని వివరించారు. హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు వల్లభనేని అనిల్ మాట్లాడుతూ కార్మికుల కోరిక మేరకు అధ్యక్ష బాధ్యతలు చేపట్టి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేస్తూ వస్తున్నానని వివరించారు. ఇంకా చాలా సమస్యలున్నాయని, కొందరు కోర్టుకు వెళ్లి అభివృద్ధి నిరోధకులుగా పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ స్థలంలో ట్విన్ టవర్స్ కట్టి, ఇంకా ఇళ్లు రాని కార్మికులకు న్యాయం జరిగేలా నావంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

17నుంచి భవాని శంకర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

జిటియస్ శ్రీవీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప సాయిబాబా దేవాలయంలో భవాని శంకర స్వామి వార్షిక బ్రవహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ చిన్నరమేష్

యూసుఫ్‌గూడ, ఆగష్టు 16, ప్రభాతవార్త : వెంగళరావునగర్ డివిజన్ పరిదిలోని జిటియస్ కాలనీ దేవదాయ ధర్మదాయ శాఖ శ్రీవీరాంజనేయ భవానిశంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవస్థానంలో ఈనెల 17నుంచి 20వతేది ఆదివారం వరకు శ్రీభవాని శంకర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చిన్నరమేష్ తెలిపారు. బుధవారం దేవస్థానంలో నిర్వహించిన సమావేశంలో ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్నరమేస్‌తో పాటు కమిటి సభ్యులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను స్థానిక శాసన సభ్యులు మాగంటి గోపినాథ్ ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 17వ తేది గురువారం ఉదయమే విజ్ఞేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షాస్వీహరణ, రక్షా బందనం, ధ్వజా రోహనం, అగ్నిప్రతిష్టాపన, ఉంటుందని, 18వ తేది శ్రావణ శుక్రవారం ఉదయం 9:30 గంటలకు రాజశ్యామల హోమం, వారాహిహోమం, 19వతేది శనివారం ఉదయం 9:30 గంటలకు శ్రీభవాని శంకర స్వామికి అష్టోత్తర కళాభిషేకం, 10:30 గంటలకు అఘోరా పాశుపతి హోమం, 20వతేది ఆదివారం ఉదయం 10గంటలకు శ్రీ సరస్వతి హోమం, దక్షిణా హోమంతో పాటు మధ్యాహ్నం 12:00గంటలకు పుర్ణాహుతి, వీరాజన మంత్ర పుష్పం, ఆశీర్వచనం, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు ప్రతి రోజు మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈబ్రహ్మోత్సవ పూజల్లో స్థానిక శాసన సభ్యులు మాగంటి గోపినాథ్, కార్పోరేటర్ దేదిప్య రావులు పాల్గొంటారని చైర్మన్ తెలిపారు. ఈకార్యక్రమంలో కమిటి సభ్యులు దేవేందర్ శర్మ, సిహెచ్ శ్రీనువాస్, జి.లక్ష్మీ, కిలారు నర్సింహరావు, వెంకటేశ్వర్లు, ఈకె సత్యనారయణ, పి.స్రవంతి, పాల్గొన్నారు.

దీపం కాంతిలో భ్రమరాంబిక అమ్మవారి దర్శనం

చాంద్రాయణగుట్టలో పురాతనమైన స్వయంభూ చెన్న మల్లిఖార్జున స్వామి ఆలయం


దీపాల కాంతులలో భ్రమరాంబిక అమ్మవారు, చెన్న మల్లిఖార్

కార్వాన్ కాచి సంఘం అధ్యక్షునిగా పురుషోత్తమ్‌సింగ్

కార్వాన్ కాచి సంఘం నూతన కమిటీ

మెహిదీపట్నం, ఆగస్టు 16, ప్రభాతవార్త : కార్వాన్ కాచి సంఘం నూతన అధ్యక్షునిగా ఎం.పురుషోత్తమ్‌సింగ్ నియమితులైనారు. ఈ సందర్భంగా కార్వాన్‌లోని కాచి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పురుషోత్తమ్‌సింగ్ మాట్లాడారు. తనపై నమ్మకముంచి అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన కాచి కులస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాచి కులస్తుల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కాచి కులస్తులందరు అధ్యక్షులు ఎం.పురుషోత్తమ్‌సింగ్, ఉపాధ్యక్షులు ఎం.కుందన్‌లాల్‌సింగ్, ఎస్.అజయ్‌సింగ్, జనరల్ సెక్రటరీ బి.తిలక్‌సింగ్, జాయింట్ సెక్రటరీ బి.హరిశ్యాంసింగ్, ఎ.సుభాష్‌సింగ్, ట్రెజరరీ ఎం.సోహాన్‌సింగ్, జాయింట్ ట్రెజరరీ ఎ.రాజేష్‌సింగ్‌లను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్వాన్ పురవీధుల్లో కాచి కులస్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాచి సంఘం సభ్యులు దినేష్‌సింగ్, హరీశ్‌సింగ్, సుభాష్‌సింగ్, రాజేశ్‌సింగ్‌లతో పాటు కాచి కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు కొందరికే: బిజెపి

ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీస్తున్న మేకల సారంగపాణి

సికింద్రాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త: జనాకర్షణ పథకాలు ప్రవేశపెట్టి వాటిని కేవలం కొంతమందికి మాత్రమే అందించడం బీఆర్ఎస్ నిర్లక్ష్యానికి నిదర్శనమని బీజేపీ మహాకంళి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు బౌద్ధనగర్‌లోని పలు వీధుల్లో పర్యటించి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు జరుపుతున్న పథకాలు అర్హులైన వారందనికి అందుతున్నాయాలేదని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో పదివేల డబుల్ బెడ్‌రూమ్ ఇంట్లు కట్టించి ఇవ్వకపోతే ఓట్లు అడగనని డిప్యూటీ స్పీకర్ అన్నారని, కాని కేవలం 5 వందల ఇండ్లు మాత్రమే కట్టించి చేతులు దులుపుకున్నారని అన్నారు. ఈ కార్యాక్రమంలో మేకల కీర్తి, వెంకటేష్ యాదవ్, హనుమంతు, సాయిదత్తు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, సుశీల, మమత ఇతర నేతలు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయాలి : జీవకన్

150 డివిజన్ అంబేద్కర్ నగర్‌లో ప్రసంగిస్తున్న కాంగ్రెస్ నేత జీవకన్ తదితరులు

కంటోన్మెంట్, ఆగస్టు 16 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలని అల్వాల్ మున్సిపల్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నేత జీవకన్ సూచించారు. బుధవారం మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిజగా హాజరై ప్రసంగించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఎవరికి కెటాయించిన వారి గెలుపు కోసం వ్యక్తిగత విబేదాలు,గ్రూప్ రాజకీయాలు పక్కన పెట్టి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆర్.డి.నాగేశ్ యాదవ్, డి.బాబురావ్, జయరాజు, నల్లరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి : వడ్డెన్న

మారేడ్‌పల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను తనిఖీ చేస్తున్న ఇంటర్మీడియట్ అధికారి ఒడ్డెన్న

అడ్డగుట్ట,ఆగస్టు 16 ప్రభాతవార్త: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న బాల బాలికలు ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించాలని హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడి యట్ విద్యాధికారి వడ్డెన్న సూచించారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్‌లో పెద్ద ఎత్తున అడ్మిషన్లు చేయించినందుకు కళాశాల ప్రిన్సిపాల్‌ను అభినందించారు. అదే విధంగా పేద విద్యార్థులకు తన సొంత నిధులతో కాలేజీలో తరగతి గదులను నిర్మిస్తున్న దాత డాక్టర్ మెనగ రాంమోహన్ రావ్‌ను అభినందించారు. ఈ కర్యాక్రమంలో ఇన్‌ఛార్జిప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్వల్,శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు మరువలేము



హైదరాబాద్, ఆగస్ట 16 ప్రభాతవార్త: దేశ సమగ్రత, సమైక్యత, ఆర్థికాభివృద్ధి కోసం మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి చేసిన సేవలు మరువలేనివని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ కొనియాడా రు. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశారని ఆమె ప్రసంసించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, మహేష్, జైస్వాల్, కొండయ్య, మల్లేష్, సాయి, వేణుగోపాల్‌యాదవ్, ప్రవీణ్, అనిల్, హితేష్, భాను పాల్గొన్నారు.

సంగమేశ్వర వేంకటేశ్వర దేవాలయంలో నిజశ్రావణమాస పూజలు

నాంపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిజ శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని రేపు 17 గురువారం నుండి సెప్టెంబరు 15 శుక్రవారం వరకు నెలరోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ధర్మానుసారం వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా 21 సోమవారం ఉదయం 8.30లకు నాగులపంచమి, గరుడ పంచమి, శ్రీ గరుడ ఆళ్వాదిక్ అభిషేకం; 26 శనివారం ఉదయం 7గంటలకు మూలనక్షత్రం-శ్రీ సరస్వతిదేవి మూలమంత్ర హోమం; 29 మంగళవారం ఉదయం 9గంటలకు శ్రవణా నక్షత్రం-శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణం; సెప్టెంబరు 1 శుక్రవారం ఉదయం 9గంటలకు శ్రీ హోమము; 3 ఆదివారం ఉదయం 7గంటలకు సంకటహర చతుర్థి-గణపతి హోమం, రాత్రి 6గంటలకు గణపతి అభిషేకం; 7 గురువారం రాత్రి 6గంటలకు శ్రీకృష్ణ జన్మాష్టమి-అభిషేకం; 9 శనివారం ఉదయం 7గంటలకు ఆరుద్ర నక్షత్రం-రుద్రహోమం; 13 బుధవారం ఉదయం 7.00, 9.30గంటలకు మాసశివరాత్రి-ఏకవార రుద్రాభిషేకం; 25 శుక్రవారం రాత్రి 6గంటలకు లక్ష్మీ కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయని, పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజాకార్యక్రమాల్లో పాల్గొని స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని పి.లక్ష్మారెడ్డి కోరారు.

ఆల్విన్ కాలనీలో డ్రైనేజి పనులు వేగవంతం : కార్పొరేటర్ దొడ్ల

డ్రైనేజి పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 16, ప్రభాతవార్త : ఆల్విన్ కాలనీ డివిజన్‌లో వేగవంతంగా భూగర్భ డ్రైనేజి పనులు పూర్తి చేస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీలో పదహారు లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించబోతున్న భూగర్భ డ్రైనేజి లైన్‌ను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో జన నివాసాలు పెరిగి డ్రైనేజి వ్యవస్థ సరిపోకపోవడంతో నూతన డ్రైనేజి లైన్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. త్వరలో శేరిలింగంపల్లి శాసనసభ్యులు ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీతో ప్రారంభోత్సవం చేయించి నిర్మాణ పనులు మొదలు పెడతామని అన్నారు. డ్రైనేజి నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని కాలనీ వాసులకు హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు కాశినాథ్ యాదవ్, రాజిరెడ్డి, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నదానిలో కొంత దానం చేసినపుడే నిజమైన సంతృప్తి

వివేకానందనగర్ కాలనీలో పారిశుధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న గంగుమళ్ల స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు గంగుమళ్ళ వరప్రసాద్ సుజాత

యూసుఫ్‌గూడ, ఆగష్టు 16, ప్రభాతవార్త : ఉన్నదానిలో కొంత ఇతరులకు దానం చేసినపుడే జీవితంలో నిజమైన సంతృప్తి లభిస్తుందని గంగుమళ్ళ స్వచ్ఛంద సేవా సంస్థ, శివదుర్గా ఎస్టేట్ నిర్వాహకులు గంగుమళ్ళ వరప్రసాద్ సుజాత దంపతులు అన్నారు. బుధవారం వివేకానంద నగర్ కాలనీలో పారిశుధ్య కార్మికులకు కుటుంబ సభ్యులతో కలిసి చీరలను ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం మనం నివసించే ప్రాంతాలలో పారిశుధ్య కార్మికులు వారి విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని అదేవిధంగా కరోనా సమయంలో కూడా పారిశుధ్య కార్మికులు ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వర్తించారని వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో వెంకట్ మహేష్, వెంకట్ శ్రీభవాని, మాస్టర్ శరత్ శ్రీనువాస్, బేబి శ్రీలక్ష్మీ సునందిత్, దినేష్ సురేంద్ర, గంగుమళ్ళ అరవళ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేద మెరిట్ విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

మేదరి సంఘం ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఏఎస్‌పీ ఇంటెలిజెన్స్ డి.రమేష్

ధర్నాచౌక్, ఆగస్టు 16, ప్రభాతవార్త: హైదరాబాద్ మేదరి సంఘం ఆధ్వర్యంలో పేద మెరిట్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ జరిగింది. బుధవారం కేతేశ్వర కళ్యాణ మండపం నందు నిర్వహించిన ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా ఏఎస్‌పీ ఇంటెలిజెన్స్ డి.రమేష్ పాల్గొని పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 360 మంది విద్యార్థులకు పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన మేదరి సంఘం నాయకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు ప్యారసాని బాలరాజన, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.పి.మురళి కృష్ణ, ఉపాధ్యక్షులు పుట్ట యాదగిరి, సలహాదారు ప్రతాపగిరి గణేష్‌రావు, కమిటటీ సభ్యులు శీల వెంకటేష్, పుట్ట లక్ష్మణ్, పాతకోటి మహేష్, వాసం భార్గవ్, శీలం బాలచెందర్, నోముల గోపాల్, సత్యనారాయణ, తుమ్మల శ్రీను, శ్రీశైలం జైశ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

కెపిహెచ్‌బి కాలనీలో ఇష్టానుసారంగా పార్కు స్థలం కబ్జా

అక్రమంగా షెడ్ల నిర్మాణం : మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు హరీష్‌రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 16, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం లోని కెపిహెచ్‌బి డివిజన్ 6వ ఫేస్‌లో కబ్జాదారులు పార్కుని కబ్జా చేసి ఇష్టానుసారంగా షెడ్ల నిర్మాణం చేపట్టి డబ్బులు దండుకుంటుంటే స్థానిక ఎమ్మెల్యే వారికి సహకారం అందిస్తున్నారని మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక బిజెపి నేతలతో కలిసి పన్నాల హరీష్‌రెడ్డి కెపిహెచ్‌బి కాలనీలో పార్కు స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాదయాత్రల పేరిట డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు పార్కులు కబ్జా అవుతుంటే కనిపించడం లేదని విమర్శించారు. అభివృద్ధి అంటే పార్కులు కబ్జా చేయడం తప్ప మరొకటి కనిపించడం లేదన్నారు.

సమస్యలు ఉంటే చెప్పండి.. పరిష్కరించే బాధ్యత నాదే: మంత్రి తలసాని

మేకల బండ ప్రాంతంలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట ఆగస్టు 16, ప్రభాతవార్త : సమస్యలు ఏమి ఉన్నా చెప్పండి పరిష్కరించే బాధ్యత నాది అంటూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజలకు హామీ ఇచ్చారు.బుధవారం రాంగోపాల్‌పేట డివిజన్ మేకల బండ ప్రాంతంలో వివిధ శాఖల అధికారులతో కల్సి పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెల్సుకున్నారు. మేందుగా మంత్రికి స్థానిక మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ నీటి సరఫరా సమయం పెంచాలని, ప్రెజర్ కూడా పుంచాలని కోరగా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం ప్రతి ఇంటికి 20వేల లీటర్ల నీటిని ఉచితంగా సరఫరా చేస్తుందని,దానిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అదే విదంగా స్థానిక కమ్యూనిటీ హాలులో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కమ్యూనిటీ హాల్ పై మరో అంతస్తు నిర్మాణానికి ప్రతి పాదనలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ హాలు వెనుక వీధిలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు మంత్రికి విన్న వించగా ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించిన మంత్రి అక్కడ ఒక స్తంభం ఏర్పాటు చేసి వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని ఆదేశించారు.బస్తీలోని అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలుగుతున్నాయా లేదా పరిశీలించి అవసరమైన చోట్ల లైట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట మాజీ కార్పోరేటర్ అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్,జోనల్ కమీషనర్ రవికిరణ్,ఈఈ సుదర్శన్,వాటర్‌వర్క్స్ సీజీఎమ్ ప్రభు,ఎలక్ట్రికల్ డిఈ శ్రీధర్,స్ట్రీట్ లైట్ అధికారి భరత్,శానిటేషన్ డీఈ శ్రీనివాస్,టౌన్ ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్, బస్తీ వాసులు జగన్,అభిషేక్,సూరి,చిట్టిబాబు,వినయ్,వరమ్మ,కౌసల్య,శ్రీదేవి తదితరులు ఉన్నారు.

అటల్ బిహారి వాజ్‌పేయ్ వర్ధంతిసందర్భంగా నివాళ్లు ఆర్పిస్తున్న బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ

మాజీ ప్రధానికి నివాళులు

అఫ్జల్‌గంజ్,ఆగస్టు 16 ప్రభాతవార్త: భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతిన్ని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ నివాళ్లు ఆర్పించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఉమాశేఖర్,మురళీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి

కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్

పాదయాత్రలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్

బేగంబజార్, ఆగస్టు16 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కారించేందుకు గాను తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలకసంస్థ బిజెపి ప్రతి పక్షనాయకుడు గొంటి శంకర్‌యాదవ్ అన్నారు. బుధవారం బేగంబజార్ డివిజన్ పరిధిలోని జగ్గనాథ్‌ద్వారా,శంకర్‌బజార్ బస్తీలలో బిజెపి నాయకులు,అధికారులతో కలిసి పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి సమస్య ను పరిష్కరించాలని జలమండలి మేనేజర్ గురున్నాథ్‌ను ఆదేశించారు.ఈ పాదయాత్రలో బిజెపి నాయకులు యోగేష్‌ముదిరాజ్, రమేష్‌లాల్ యాదవ్,వినోద్‌సింగ్, జుగల్‌కిషోర్, కట్ట రమేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రమైనారిటీ కమిషన్ వైస్‌చైర్మన్‌గా శంకర్ లూక్ బాధ్యతలు

చిక్కడపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రమైనారిటీ కమిషన్ వైస్‌చైర్మన్‌గా రామ్‌నగర్ డివిజన్‌కు చెందిన శంకర్‌లూక్ బాధ్యతలను స్వీకరించారు. మైనారిటీ కమిషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమం లో హోంమంత్రి మహమూద్ ఆలీ, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ పాల్గొని అభినందించారు.

అభివృద్ధి పనులపై కమిషనర్ సమీక్ష

అభివృద్ధి పనులు, పతకాల అమలు తీరుపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర

నార్సింగి, ఆగస్టు 16 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇతర పతకాల అమలు తీరుపై బుధవారం కమీషనర్ శరత్‌చంద్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పారిశుద్యం, శానిటేషన్, హరితహారం, అడ్వర్‌టైజ్‌మెంట్ పన్నులు, సిటీజెన్ ఫీడ్‌బ్యాక్, చెత్త సేకరణ, వ్యాపార లైసెన్స్, ఇంటి పన్ను వసూలు, అండర్ అసెస్‌మెంట్‌లు, గృహలక్ష్మీ పతకం దరఖాస్తులు ఇలా అనేక అంశాంలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఎవరికి అప్పగించిన పనులకు వారే బాధ్యులని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎప్పటి పనులు అప్పుడే పూరినత చేయాలని, పెండింగ్‌లో పెడితే, అశ్రద్ధ వహిస్తే ఇబ్బందులు తప్పవన్నారు. అధికారులు, సిబ్బంది అందరం కలిసికట్టుగా, జట్టుగా పని చేసి బండ్లగూడ కార్పొరేషన్‌ను అభివృద్ధిలో అగ్ర భాగాన నిలుపుదామని కమీషనర్ శరత్‌చంద్ర స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఓ నిర్మల, టిపిఓ విజయలక్ష్మీ, ఎంహెచ్ఓ డాక్టర్ రవి, అకౌంట్‌నస ఆఫీసర్ కృష్ణయ్య, టిఎంసి శ్రీలత, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రూ.10వేలకోట్లతో

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు

టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

ఛలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, చిత్రంలో డాక్టర్ చీమా శ్రీనివాస్

చిక్కడపల్లి,ఆగస్టు 16 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేసి రూ.10వేలకోట్లతో ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించే విధంగా తనవంతు కృషి చేస్తానని టిపిసిసి అధ్యక్షుడు, మల్కాజిగిరి ఎంపి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమా శ్రీనివాస్ ఆధ్వర్యంలో 20న నిర్వహించతలపెట్టిన 'ఉద్యమకారుల ఛలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రేవంత్‌రెడ్డి ఆవిష్కరించి ప్రసంగించారు. ఎన్నో సంవత్సరాలుగా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమ లక్ష్యాలు నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ చీమా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలలో 20శాతం తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని, నామినెటెడ్ పదవులలో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉద్యమకారులకు పెన్షన్, ఉచిత బస్సు, రైల్వే పాసులు, ఇంటి స్థలాన్ని కేటాయించాలని, ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా అన్ని రాజకీయ పార్టీలు గుర్తించి, తమ మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరీదుల శ్రీనివాస్‌గౌడ్, పి.సురేందర్‌రెడ్డి, వీరస్వామి, విష్ణువర్ధన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లోకి నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు చేరిక

పార్టీలోకి మహిళలను ఆహ్వానిస్తున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గంలోని భరత్‌నగర్ కమ్యూనిటిహాల్‌లో బాగ్ అంబర్‌పేటకు చెందిన నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు బుధ వారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతున్నదని, దీన్ని చూసిన వారు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చంద్రమోహన్, శ్రీరాములన్న, మధుసూదన్, గెలవయ్య, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

9 మంది లబ్ధిదారలకు చెక్కులను పింపిణి.. గోల్నాక క్యాంప్ కార్యాలయంలో అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన 9 మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన 3.01 లక్షల విలువైన చెక్కులను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కాలేరు మాట్లాడుతూ సిఎం కెసిఆర్‌కు పేద, మధ్య తరగతి ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చి అండగా నిలవడమే కాకుండా వారి వైద్యానికి, ఇతర ఖర్చులకు అయ్యే డబ్బులను భరిస్తూ సొంత కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నారని చెప్పారు.



ప్రణాళికబద్ధంగా అభివృద్ధి : ఎమ్మెల్యే బలాల

స్మశాన వాటిక అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట, ఆగస్టు 16 ప్రభాతవార్త : మలక్‌పేట నియోజకవర్గంలో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మూసారాంబాగ్‌డివిజన్ గడ్డిఅన్నారం గౌడసంఘం స్మశాన వాటికలో రూ. కోటి 40 లక్షలతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బలాల శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడ్డిఅన్నారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న గౌడ స్మశాన వాటికలో రెండు దహన వాటికలు, పచ్చదనంతోపాటు అన్ని వసతులు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. అదేవిధంగా గడ్డిఅన్నారంలో రూ. 8.3 లక్షలతో నిర్మించిన రోడ్డును బలాల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, మాజీకార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, చల్లూరి రఘు నందన్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూసారాంబాగ్ డివిజన్‌లో... మూసారాంబాగ్ డివిజన్‌లో వేగవంతంగా అభివృద్ధిపనులు చేపడుతున్నట్లు డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని శాలివాహననగర్ పార్కు సమీపంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. అదే విధంగా డివిజన్‌లో కొనసాగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులు ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరి, సంతోష్, ప్రణీష్, కిరణ్, మల్లేష్, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవయుగ యూత్ అసోసియేషన్ అధ్యక్షునిగా శ్రీధర్

సరూర్‌నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త: జిల్లెలగూడ నవయుగ యూత్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షునిగా సిద్దాల శ్రీధర్ ఎన్నికయ్యారు. బొడ్రాయి సమీపంలోని వినాయక మండపంవద్ద సమావేశమైన కమిటీ సభ్యులు అసోసియేషన్ అధ్యక్షునిగా సిద్దాల శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కానాల కేమాద్రి, సభ్యులు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, సప్పిడి జంగారెడ్డి, సిద్దాల బాలప్ప, కొత్త మధుసూదన్‌రెడ్డి, అర్కల కాశీనాథ్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, పోరెడ్డి సుధాకర్‌రెడ్డి, సిద్దాల జగదీశ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సప్పిడి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాచారంలో వాజ్‌పాయ్ వర్ధంతి కార్యక్రమం

నాచారం, ఆగస్టు 16 ప్రభాతవార్త: బిజేపీ నాచారం డివిజన్ అధ్యక్షులు ఎం. ప్రకాష్ ఆద్వర్యంలో బిజెపి శ్రేణులు నాచారంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యవర్గ సభ్యులు అంపాల పద్మారెడ్డి, రాష్ట్ర గిరిజన మోర్చ ప్రధాన కార్యదర్శి రవి నాయక్, జిల్లా అధికార ప్రతినిధి గోపాల్ గౌడ్, జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, ఉప్పల్ మహిళా కన్వీనర్ అనితా రెడ్డి, కార్యదర్శి నవీన్, నాయకులు చంద్రమౌళి, రాజిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు పాఠశాల స్థాయినుండే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి : శంతన్‌కుమార్

సైదాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ప్రముఖ విద్యావేత్త శంతన్ కుమార్ అన్నారు. సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లోని కేంబ్రిడ్జి ఉన్నత పాఠశాలలో బుధవారం ఇన్వెస్టిచర్ సెరమని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శంతన్‌కుమార్ ప్రిన్సిపాల్ ఝాన్సీతో కలిసి పాఠశాల హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్, కెప్టెన్స్, వైస్ కెప్టెన్లను అభినందించారు. బ్యాడ్జిలు అందజేసి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : కార్పొరేటర్ నరసింహగుప్తా

ఎల్.బి.నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త : ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నరసింహగుప్తా పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్‌లోని న్యూ దిల్‌సుఖ్ నగర్ కాలనీలో వాటర్‌లైన్ చెడిపోయి పొల్యూషన్ వస్తున్నదని, వాటర్ లో ప్రెషర్ వస్తుందని స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం కార్పొరేటర్ అక్కడికి చేరుకొని వాటర్ వర్క్స్ జిఎం బలరాంరాజుతో ఫోన్‌లో మాట్లాడి లైన్ మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులతోపాటు బిజెపి నాయకులు కృష్ణ ప్రకాష్ ,ఉదయ్‌కుమార్, అర్జున్‌సింగ్, వాటర్‌వర్క్స్ ఇనిస్పెక్టర్ సురేందర్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ప్రేమ్‌కుమార్

కాలనీవాసుల సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి, ఆగస్టు 16 ప్రభాతవార్త : ఈస్ట్ ఆనంద్‌భాగ్ డివిజన్ పరిధిలోని బిజేఆర్ భవన్‌లో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో పాటు సీనియర్ ఆసిస్టెంట్ రమేష్, బిల్ కలెక్టర్ విజయనిర్మలతో కలిసి డబుల్ బెడ్ రూమ్ సర్టిఫికేట్ల వెరిఫికేషన్ చేయడం జరిగింది. అదే విధంగా బిజేఆర్‌నగర్ గుట్టపైన వాటర్ ప్రెజర్ రావడంలేదని, బోర్ వాటర్, రోడ్డు సమస్య పరిష్కరించాలని స్థానికులు కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ దృష్టికి తీసుకురావడం జరిగింది. వెంటనే స్పందించిన కార్పొరేటర్ జలమండలి మేనేజర్ వేణుగోపాల్‌నాయుడు, వాటర్ జంక్షన్, భూస్టర్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాబు, సంపత్‌రావు, కిషోర్, వాజిత్, షరీఫ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం



సమరయోధుడు వసంతరావును సన్మానిస్తున్న బుజ్జినాయుడు తదితరులు

మలక్‌పేట, ఆగస్టు 16 ప్రభాతవార్త : స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించడం మనభాగ్యమని ప్రముఖ సంఘ సేవకులు బుజ్జినాయుడు, పి.శ్రీనివాసరావు, రవీందర్, గోవర్ధన్, అర్చకులు అశోక్ జోషి, ఆలయ ఇఓ సత్యనారాయణలు పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్ హనుమాన్ దేవాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు వసంత్‌రావు కడ్కికర్ (97)ను వారు ఘనంగా సన్మానించారు. అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సమరయోధులను సన్మానించడం జరిగిందని వారు తెలిపారు. దేశానికి సేవలందించిన కృషి, అంకితభావానికి వారు ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలి : చల్లా నర్సింహారెడ్డి

అంబేద్కర్‌నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న చల్లా నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త: దళిత బంధును ప్రతి దళిత కుటుంబానికి ఇవ్వాలని రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ అంబేద్కర్‌నగర్ కాలనీలో డిసిసి ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి దళిత బంధు పథకం కింద లబ్ధి చేకూర్చాలని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో ఉన్నాయనీ కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు కందాల బాబు, కార్పొరేటర్లు చల్లా కవితా బాల్‌రెడ్డి, సిద్దాల మౌనిక శ్రీశైలం, నాయకులు ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, నిమ్మల వెంకటేశ్‌గౌడ్, కీసర యాదిరెడ్డి, ఆల శ్రీనివాస్‌రెడ్డి, ఐతరాజు భాస్కర్, శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకం : హరిగౌడ్

వాజ్‌పేయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న హరిగౌడ్

సైదాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త: దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ కళ్యాణ్‌నగర్‌లో జరిగిన కార ్యక్రమంలో వాజ్‌పేయి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర ్పించారు. ఈ సందర్భంగా హరిగౌడ్ మాట్లాడుతూ వాజ్‌పేయి తన జీవితాన్నంతా దేశ సేవకే అంకితం చేశారన్నారు. నేటి తరానికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మడిగల లక్ష్మారెడ్డి, ఫణిగౌడ్, పటాలే నవీన్ కుమార్, చంద్రకుమార్, వెంకట్‌రెడ్డి, రమేష్, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి

వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న పెండ్యాల నర్సింహ, బిజెపి నాయకులు

సరూర్‌నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ చౌరస్తాలో బిజెపి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ వాజ్‌పేయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, నాయకులు కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, సూల ప్రభాకర్, బెల్లంకొండ నాగరాజు, యాదగిరియాదవ్, ఆవుల సత్తయ్య, గోపినాథ్, జెడి కుమార్, విక్కీ సాగర్, కార్పొరేటర్ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సన్మానం... మీర్‌పేట్ 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి ఆధ్వర్యంలో వాజ్‌పేయి వర్ధంతిని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా చారి ఆధ్వర్యంలో మాజీ సైనికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుమణి గోపాల్‌గౌడ్, ఘయాసుద్దీన్, మాజీ ఎంపిటిసి బొజ్జ పరమేష్, శివకుమార చారి, భాస్కర్‌చారి, అరవింద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాప్రా సర్కిల్ ఎఇ లింగారావుకు సన్మానం

ఎఇ లింగారావును సన్మానిస్తున్న కార్పొరేటర్ శాంతి శేఖర్

నాచారం, ఆగస్టు 16 ప్రభాతవార్త: కాప్రా సర్కిల్ నాచారం డివిజన్‌లో గత కొంతకాలంగా అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న లింగారావు ఉత్తమ ఇంజనీర్‌గా జోనల్ కమీషనర్‌చే ప్రసంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నాచారంలోని వార్డు కార్యాలయంలో ఏఈ.లింగారావును కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్, బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్ యాదవ్, యాదగిరి, పాండు నాయక్, చంద్రశేఖర్,వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్‌మార్ తధితరులు పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవాలయంలో ప్రత్యేక పూజలు

ఎల్.బి.నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త : ఆర్కేపురం డివిజన్లోని శ్రీప్రత్యంగిరా పరమేశ్వర దేవాలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా దేవాలయంలో ఎండు మిరపకాయలతో ప్రత్యేక హోమం కార్యక్రమం నిర్వహిస్తారు. నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు దేవాలయంలో హోమం నిర్వహించారు. అదేవిధంగా పలువురు ప్రజాప్రతినిధులు, ప్రబుత్వ ఉన్నతాధికారులు కూడా తెల్లవారుజామున హోమాలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ సెక్రటరీ మునిపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి.

నిరుపేదలకు ఆర్థిక సహాయం : జంపాల్‌రెడ్డి

కుషాయిగూడ, ఆగస్టు 16 ప్రభాతవార్త : బాధిత నిరుపేద కుటుంబాలకు బిఎల్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మారెడ్డి చేస్తున్న సేవలు విస్తృత స్థాయిలో ఉండడంతో ఆయన ప్రజల మనసు దోచుకుంటున్నాడని బిఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ మీర్‌పేట్ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన గడిపె నరసమ్మ (70) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న బండారి లక్ష్మారెడ్డి జంపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామి, దూసరి నవీన్‌గౌడ్, నరేష్, సందీప్, యాదవ్, రాజు, శ్రావణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలి : ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల బాధితులకు అండగా నిలిచిన ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కుషాయిగూడ, ఆగస్టు 16 ప్రభాతవార్త : ఇళ్లను కోల్పోయిన నిరుపేద బాధితులకు ముందుగా డబుల్ బెడ్‌రూం కేటాయించకపోతే ఆందోళన చేపడతామని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. కాప్రాసర్కిల్ పరిధిలోని మీర్‌పేట్ చైతన్యనగర్‌కాలనీలో నివాసముంటున్న నిరుపేద బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారు నివాసముంటున్న ఇళ్లను తొలగించి డబల్ బెడ్ రూమ్‌లు నిర్మించడం జరిగిందని ముందుగా ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్లను కోల్పోయిన బాధిత నిరుపేదలకు డబల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునుగంటి రామ్, ప్రదీప్, సిద్దు, మహేష్, శ్రీను, బ్రహ్మచారి, ప్రసాద్, గోపాల్‌రెడ్డి, అపర్ణ, ఉమారాణి, శశికళ తదితరులు పాల్గొన్నారు

ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీ కోసం రాజీనామాకు సిద్ధపడ్డ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త : ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేరకపోతే తాను రాజీనామాకు కూడా సిద్ధపడ్డానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్‌బినగర్ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం కావడంతో బుధవారం నాగోల్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సుధీర్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పదిహేనేళ్ల కల 118 జీఓ ఒక ఘన విజయం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ కోసం అధికార పార్టీలోకి వెళ్ళామన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా రిజిస్ట్రేషన్ సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే చొరవ తీసుకుని సీఎం, మున్సిపల్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి 118 జీఓ తీసుకొచ్చి మా జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంతుల రాజారెడ్డి, చిరంజీవి, శరత్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్లికార్జునరావు, రామకృష్ణరెడ్డి, మల్లేష్, మల్లారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు మరవలేనివి : రాజ్యలక్ష్మి

వాజ్‌పేయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాజ్యలక్ష్మి

నేరేడ్‌మెట్, ఆగస్టు 16 ప్రభాతవార్త : మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి వేడుకలను వినాయక్‌నగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునిత యాదవ్ పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలు మరిచిపోలేనివని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గున్నాల లక్ష్మణ్‌గౌడ్, లింగారావు, మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వాజ్‌పేయినగర్‌లో.. వాజ్‌పేయినగర్‌లో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రావణ్ పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌గౌడ్, గౌలికర్ ఆనంద్, జి.కె హన్మంత్‌రావు, వి.కె మహేష్, నందుయాదవ్, మురళిగౌడ్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతారామకాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు



ఓపెన్‌జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

ఉప్పల్, ఆగస్టు 16 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ డివిజన్ సీతారామకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను బుధవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతారామకాలనీలో మహిళల కోసం ప్రత్యేకంగా జిమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిఒక్కరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డివిజన్‌లో అన్ని ప్రాంతాల్లో సమానంగా అభివృద్ధి చేసి ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, కార్యదర్శి కె.జగన్, కాలనీ అధ్యక్షుడు జి.రమేష్‌గౌడ్, రామాంజనేయులు, బింగి శ్రీనివాస్, నారాయణ రెడ్డి, మహమూద్, శ్యామ్, బోరంపేట రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, నిర్మల, విజయ, రుక్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో అవసరమైన చోట నూతన వీధి దీపాలు : కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త: సైదాబాద్ డివిజన్‌లో అవసరమైన చోట నూతన వీది దీపాలు ఏర ్పాటు చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ అధికారులతో కలసి డివిజన్‌లోని ఫిష్ మార్కెట్, ఎరుకల బస్తీ, హరిజనబస్తీ, త్రీ టెంపుల్స్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న పాతకరెంట్ పోల్స్ స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట నూతన పోల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇ సోహెల్, దినేష్, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేదవిద్యార్థికి ఆర్థిక సహకారం : కౌన్సిలర్



ప్రశాంత్‌కు నగదును అందిస్తున్న మురళీధర్‌రెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త: ఆర్థిక పరిస్థితి బాగోలేని నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు విద్యాభ్యాసం అందించేందుకు తనవంతుగా సహకరిస్తానని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి అన్నారు.పెద్దఅంబర్‌పేట శాంతినగర్‌కు చెందిన కోటె ప్రశాంత్ కుమార్ తండ్రి గతేడాది క్యాన్సర్‌తో మృతిచెందాడు. తల్లి, ఇద్దరు తమ్ముళ్లతో కలిసి ఉంటున్నాడు. తండ్రి మరణంతో ఆ కుటుంబ పరిస్థితి ఇబ్బందిగా మారింది. దీంతో ఇద్దరు తమ్ముళ్లను హాస్టల్‌లో చేర్చిన తల్లి హోటల్‌లో పని చేస్తూ ప్రశాంత్‌ను చదివిస్తోంది. 10వ తరగతిలో 7.7 గ్రేడ్‌తో పాసైన అతనికి గవర్నమెంట్ ఐటీఐలో సీటు రాకపోవడంతో వర్డ్ అండ్ డీడ్ ఐటీఐలో దరఖాస్తు చేసుకున్నాడు. 16,500 రూపాయల ఫీజు కట్టాల్సి ఉండగా... దానిని చెల్లించలేని స్థితిలో నాగేశ్వర్ పంపిన మెసేజ్‌కు స్పందించిన మురళీధర్‌రెడ్డి సదరు ఫీజు మొత్తాన్ని ప్రశాంత్‌కు అందించారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

ఎల్.బి.నగర్, ఆగస్టు 16 ప్రభాతవార్త : నియోజకవర్గంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్‌లో రూ.4.80 కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు బుధవారం డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దయా ఆర్‌సీసీ పైపులతో నీటి కాలువ, న్యూనాగోల్, రాఘవేంద్రకాలనీ, ఆర్‌బిఐకాలనీ, సమతాపురికాలనీ, పాత మారుతీనగర్‌కాలనీ, కొత్తపేట గ్రామం, ఎస్ఆర్ఎల్ కాలనీ, ప్రజయ్‌నివాస్‌లో సీసీ రోడ్లు నిర్మాణం పనులు, ఆర్టీసి కాలనీ కమ్యూనిటీ హాల్‌పై సీనియర్ సిటిజన్ల కోసం 2వ అంతస్తు ప్రారంభోత్సవం, భారత్‌నగర్‌లో యూజీడి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్లో ఇంకా సమస్యలు ఉన్నాయని వాటిని ప్రణాళికబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయమని అన్నారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ డివిజన్లో దశాబ్దాల నాటి పైప్‌లైన్లతో డ్రైనేజీ సమస్య వెంటాడుతోందని సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, ఆనంతుల రాజారెడ్డి, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, ఉదయ్‌గౌడ్, ఇటికల యాదగిరి, దీప్‌లాల్, పాండుగౌడ్, నీరంకి రవి, ఉపేందర్‌సింగ్, సుందర్, మహేష్, ప్రవీణ్, శ్రీశైలంగౌడ్, విజయ, బొగ్గరపు వరుణ్, మహేష్‌రెడ్డి, జంగీర్‌బాబు, అనిల్, రాము, చిరంజీవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే మంచిరెడ్డి



లబ్ధిదారుడికి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

తుర్కయంజాల్, ఆగస్టు 16 ప్రభాతవార్త : తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ లక్ష్మీనగర్ కాలనీ 23వ వార్డు బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామావత్ కళ్యాణ్‌నాయక్ సహాయ సహకారాలతో సీఎం రిలీఫ్‌ఫండ్ అప్లై చేసి ఎమ్మెల్యేకు తెలుపడంతో కమ్మగూడకు చెందిన సికిందర్‌నాయక్ 60 వేల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలు కార్పొరేటర్ వైద్యం పొందడానికి సీఎం రిలీ